# పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- 1400మంది, పీవోలు, ఏపీవోలు, 700మంది పోలీసులు
- పోలింగ్ కేంద్రాలు 269.. సమస్యాత్మకమైనవి 132
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈవీఎంలు తనిఖీ చేసిన కలెక్టర్



కొల్లాపూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఈఆర్వో కుమార్ దీపక్

కొల్లాపూర్, నవంబర్ 29: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో భాగంగా కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం ఉదయం నుంచి జరుగనున్న పోలింగ్ ప్రక్రియకు జిల్లా అధికారులు సర్వసిద్ధం చేశారు. పట్టణ శివారులోని పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కుమార్‌దీపక్,ఏఈఆర్వో శ్రీకాంత్, ఆర్డీవో నాగరాజు పర్యవేక్షణలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలతోపాటు సామగ్రిని పంపిణీ చేశారు. అయితే ఉదయం 10గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉదయ్ కుమార్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని కొన్ని ఈవీఎంల పనితీరును ఆయన పరీక్షించారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో కొల్లాపూర్, పెద్ద కొత్తపల్లి, పాన్‌గల్, కోడేరు, వీపనగండ్ల, చిన్నంబావి, పెంట్లవెల్లి మండలాల్లోని ఓటర్లు కలుపుకొని మొత్తం 2,34,167 ఉన్నారు. ఇందులో పురుషులు 1,19,263,స్త్రీలు 1,14,900 ఓటర్లు నలుగురు ఇతరులు ఉండగా 269 పోలింగ్ కేంద్రాలున్నాయి. నియోజకవర్గంలో 29 రూట్లు ఏర్పాటు చేశారు. మండలాల వారీగా ఓటర్ల వివరాలను చూస్తే పెద్దకొత్తపల్లి మండలంలో మొత్తం 23,447 ఉండగా ఇందులో పురుషులు 24,075 ఓటర్లు, స్త్రీలు 23,447 మంది, 54పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. కోడేరు మండలంలో మొత్తం ఓటర్లు 34,380 ఉండగా ఇందులో పురుష ఓటర్లు 17,635 మంది, స్త్రీలు 16,745 ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 40 ఉన్నాయి. పాన్‌గల్ మండలంలో మొత్తం ఓటర్లు 40,876 ఉండగా ఇందులో పురుషులు 21,029 మంది,స్త్రీలు 19,846 ఉన్నా రు. పోలింగ్ కేంద్రాలు 43 ఉన్నాయి. వీపనగండ్ల మండలంలో మొత్తం ఓటర్లు 22,753 ఉండగా ఇందులో పురుష ఓటర్లు 11,563 మంది, స్త్రీలు 11,190 మంది ఉన్నారు. మండలంలో పోలింగ్ కేంద్రాలు 28 ఉన్నాయి. చిన్నంబావి మండలంలో మొత్తం ఓటర్లు 24,430 మంది ఉండగా పురుష ఓటర్లు 12,288 మంది,స్త్రీలు 12,142 ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 30 ఉన్నాయి. పెంట్లవెల్లి మండలంలో మొత్తం 17,306 ఓటర్లు ఉండ గా పురుష ఓటర్లు 8,828,స్త్రీలు 8,478 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు 20 ఉన్నాయి. కొల్లాపూర్ మండలంలో మొత్తం ఓటర్లు 46,897 ఉండగా ఇందులో పురుషులు 23,845 మంది, స్త్రీలు 23,052 మందికిగాను 54 పోలింగ్ కేంద్రాలున్నాయి. మోడల్ కేంద్రాలు ఐదు, దివ్యాంగులకు ఒకటి, యువతకు ఒకటి, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు 132 అధికారులు గుర్తించారు. అయితే ప్రిసైడింగ్ అధికారులు,సహాయ ప్రిసైడింగ్ అధికారులు మొత్తం 1400 మంది కేటాయించగా అదనంగా మరో 20శాతం సిబ్బందిని రిజర్వులో ఉంచారు. అయితే ఎన్నికలు సజావుగా ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు గాను పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత కోసం కేంద్ర పోలీసు బలగాలు 700 మందిని రంగంలోకి దించారు. అయితే ఓటర్లు ఓటు హక్కును ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా వినియోగించుకోనున్నారు.ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమై సాయంత్రం 5గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగియనున్నది.

**ఎన్నికలకు నిర్వహణకు పకడ్బందీ చర్యలు**

జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపట్టినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి,కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. బుధవారం కొల్లాపూర్‌లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 802 పోలింగ్ కేంద్రాలు, 87 రూట్ల వారిగా ఎన్నికల సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి భద్రతా దళాలతో సిబ్బంది తరలివెళ్లారని చెప్పారు. పోలింగ్ అనంతరం నాగర్‌కర్నూల్ నెల్లికొండ వ్యవసాయ మార్కెట్ యార్డులో రిసీవింగ్ కేంద్రానికి చేరుకోవాలని తెపారు. మూడో తేదీన కౌంటింగ్ కోసం ఏర్పాట్లు చేశామని, రు.595 కేంద్రాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేయడంతో పాటు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. రేపటి ఎన్నికల పోలింగ్ కోసం ఉదయం 5;30గంటలకు మాక్ పోలింగ్ ప్రారంభించి అన్ని క్లియర్ చేసిన అనంతరం, ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రశాంతంగా ప్రారంభించి పారదర్శకంగా ముగించాలని పేర్కొన్నారు. జిల్లాలో 595 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. 449 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, భద్రతా చర్యలు తీసుకునామని వెల్లడించారు.



కొల్లాపూర్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి తరలివచ్చిన ఎన్నికల సిబ్బంది



కొల్లాపూర్‌లో ఎన్నికల బందోబస్తుకు వెళ్తున్న పోలీసులు



కొల్లాపూర్ కేంద్రం నుంచి ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

కోడేరు, నవంబర్ 29: మండల కేంద్రం కోడేరుకు చెందిన వృద్ధురాలు తెలుగు మషమ్మ(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తనవంతు సాయంగా బాధిత కుటుంబానికి రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లారెడ్డి, బద్దుల శేఖర్‌యాదవ్, విండో డైరెక్టర్ దూరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీటీసీ నరసింహ, మాజీ ఉపసర్పంచ్ నందిపేట బాలస్వామి, బంగి శేషయ్య పాల్గొన్నారు.

## మండలంలో 54 పోలింగ్ కేంద్రాలు

పెద్దకొత్తపల్లి, నవంబర్ 29: మండల పరిధిలోని 32 గ్రామాల్లో 54 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో ఓటర్లకు తాగునీటి వసతి ఇతర సదుపాయాలు కల్పించారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు, సీసీ కెమెరాలతో పకడ్బందీగా నిఘా ఏర్పాటు చేశారు. బీఎల్వోల వద్ద ఓటరు జాబితాలను అందుబాటులో ఉంచి ఓటర్ స్లిప్పులు తీసుకెళ్లేందుకు బీఎల్‌వోలను పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసినట్లు తాసీల్దార్ ఇబ్రహీం అలీ తెలిపారు. అలాగే భద్రతాచర్యలు చేపట్టామన్నారు. రాజకీయ పార్టీల ఏజెంట్లకు సూచనలు, సలహాలు చేశామని పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమై, సాయంత్రం 5గంటలకు ముగుస్తుందని తెలిపారు. ఓటర్లు, రాజకీయ పార్టీల నాయకులు గమనించాలని తెలిపారు.

## వరిగడ్డి దగ్ధం

పెద్దకొత్తపల్లి, నవంబర్ 29: మండలంలోని ముష్టిపల్లిలో ప్రమాదవశాత్తు వరిగడ్డి దగ్ధమై రూ.20వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు గడ్డం సన్నయ్య తెలిపారు. ప్రభుత్వపరంగా అధికారులు ఆదుకోవాలని బాధితుడు తెలిపారు. వరిగడ్డి దగ్ధం సంఘటనపై తాసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తానని బాధితుడు పేర్కొన్నాడు.

## తప్పులతడక ఓటరు జాబితాను సవరించాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు శ్రీరామ్

పాన్‌గల్, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితాలు తప్పులతడకని, వచ్చే ఎన్నికల్లోనైనా సవరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కేతూరి శ్రీరామ్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కేతేపల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇలాంటి జాబితాలతో అసెంబ్లీ ఎన్నికల్లో నిజమైన అభిప్రాయం ఎలా వెల్లడవుతుందని ప్రశ్నించారు. జిల్లాలోని చాలా గ్రామాల్లో చనిపోయిన వారిపేర్లు, పెళ్లయి అత్తగారిండ్లకు వెళ్లిన ఆడపిల్లల పేర్లు తొలగించలేదని తెలిపారు. కొత్తగా ఓటుకు దరఖాస్తు చేసుకున్న కొందరి పేర్లు జాబితాలో నమోదు కాలేదని విమర్శించారు. జాబితాలు అసమగ్రంగా గందరగోళంగా ఉన్నాయని తప్పుపట్టారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పెద్ద హనుమంతు, లక్ష్మీనారాయణ, కాకం చిన్న రాముడు పాల్గొన్నారు.

## ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

పాన్‌గల్, నవంబర్ 29: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో మొత్తం 40,876 ఓటర్లు ఉండగా, 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో పురుషులు 21,115 మంది, స్త్రీలు 19,760 ఓటర్లు ఉన్నారు. ఇందుకుగాను మొత్తం 215 మందిని ఎన్నికల సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఎలాంటి ఘర్షణ తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు.

## పోలింగ్ కేంద్రాల్లో సర్వం సిద్ధం



వీపనగండ్ల పోలింగ్ కేంద్రానికి చేరుకున్న పోలీసులు

వీపనగండ్ల, నవంబర్ 29: మండలంలో మొత్తం 28 పోలింగ్ కేంద్రాలలో 22753 మంది ఓటర్లు ఉన్నారని.. అందులో మహిళలు11190 మంది, పురుషులు 11563 మంది ఓటర్లు ఉన్నట్లు తాసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. ఉదయం7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటర్లు ఓటు హక్కును ప్రశాంతగా వినియోగించుకునేలా శాంతి భద్రతలను నిమిత్తం స్థానిక ఎస్సై రవిప్రకాశ్ ఆధ్వర్యంలో కేంద్ర బలగాలను స్థానిక పోలీసులతో కలిసి పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కావాల్సిన ఏర్పాట్లను సమకూర్చే పనిలో స్థానిక పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమయ్యారు.

### ప్రత్యేక బందోబస్తు

చిన్నంబావి, నవంబర్ 29: మండలంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని ఎన్నికల అధికారి తాసీల్దార్ ఎం.డీ ఇక్బాల్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ల వద్ద పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మండల పరిధిలో మొత్తం 17 గ్రామ పంచాయతీల్లో 30 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 23,820 మంది ఓటర్లు ఉన్నారని, వారిలో 12,003 ఓట్లు మహిళలు, 11,817 పురుషుల ఓట్లు ఉన్నాయని తెలిపారు. బుధవారం సాయంత్రం పోలింగ్ కేంద్రాల వద్దకు పోలింగ్ అధికారులు ఎన్నికల సామగ్రి తో పోలీస్ బందోబస్తు మధ్య బస్సుల్లో చేరుకున్నారు. ఉదయం 7.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.